క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలతో ప్రయోజనం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అర్హులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని పలువురి లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పేదల ఆస్పత్రి ఖర్చుల కోసం ఆర్థిక సహాయంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. నాయకులు రమేష్ చౌహాన్, జ్ఞానేశ్వర్‌పాటిల్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రశీదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

సంగారెడ్డి టౌన్ : రైతులు కొనుగోళ్లు చేసే ప్రతిదానికి రశీదును తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త విజయకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఇరిగిపల్లిలో రైతు ముంగిట శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. సాగునీటిని ఆదా చేయడం, పంట మార్పిడి వంటి విషయాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లు చేసే ప్రతి రశీదును జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

నిధులు కేటాయించండి

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పెండింగ్ పనులను పూర్తి చేయడానికి నిధుల మంజూరు చేయాలని శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ హేమంత్‌ను కార్పొరేటర్ కుమార్‌యాదవ్ కోరారు. సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. మెట్టుకుమార్ మాట్లాడుతూ.. ఆల్విన్ కాలనీ, సీతారాంపురం కాలనీ, గాంధీకాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులతో పాటు గాంధీ థీమ్ పార్క్ సరైన నిర్వహణ లేదని అందుకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

ఘనంగా ఆత్మీయ సన్మానం



రవీందర్ రెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్ గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు డీఎస్పీగా పని చేసి బదిలీపై వెళ్లిన రవీందర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రామచంద్రాపురంలో ఆత్మీయ సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, పని చేసిన ప్రాంతంలో మనం చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని తెలిపారు. రవీందర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా, అధికారులు పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ రవీందర్ రెడ్డిని సన్మానించారు.

శిఖం భూములను కాపాడాలి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని రేలకుంట శిఖం భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ స్థాయి భవనాలను నిర్మిస్తున్న బిల్డర్లపై చర్యలు తీసుకోవాలని ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు కలిసి ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 71లోని రేలకుంట ఆక్రమణకు గురవుతోందని, జిప్లస్ ఫైవ్ భవంతులను నిర్మించి విక్రయిస్తున్నారని తెలిపారు. ఇదే అదునుగా సర్వే నంబర్ 44లో 600 గజాలు, 795 గజాల చొప్పున హుడా భూముల్లో 59 జీఓ కింద అనుమతులు పొందారు. మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా సర్వే నంబర్ 209లో హుడా అనుమతుల ముసుగులో శిఖం భూముల్లో భారీ నిర్మాణాలను చేపడుతున్నారని వాపోయారు. సమగ్ర సర్వే చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

30 వరకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

హత్నూర(సంగారెడ్డి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో చదువుతున్న, చదువుపూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులకు ఉపాధి కల్పన లక్ష్యంగా నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హత్నూర సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిని ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

ఎందుకింత నిర్లక్ష్యం?



సబ్‌స్టేషన్ మంజూరై ఏడు సంవత్సరాలు

- అసంపూర్తిగా నిర్మాణం
- ప్రజలకు తప్పని కరెంట్ ఇక్కట్లు

రామచంద్రాపురం, (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతన సబ్‌స్టేషన్ మంజూరై ఏడేళ్లు గడుస్తున్నా నేటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడంతో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏడు సంవత్సరాల్లో మున్సిపాలిటీ పరిధిలో అనేక నూతన కాలనీలో వచ్చాయి. కానీ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయటంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ఇక్కడ ప్రజలకు విద్యుత్ సమస్యల తప్పడం లేదు.

2019లో సబ్‌స్టేషన్ మంజూరు..

మున్సిపల్ పరిధి విద్యుత్‌నగర్‌లోని సబ్‌స్టేషన్ నుంచి పలు కాలనీలకు విద్యుత్ సరఫరా అవుతుంది. మున్సిపల్ పరిధిలో అనేక కాలనీలు రావటంతో విద్యుత్ సమస్యలు అధికమయ్యాయి. దీంతో 2019లో తెల్లాపూర్‌కు నూతన సబ్‌స్టేషన్ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది.

భూకేటాయింపు.. నిధులు మంజూరు

సబ్‌స్టేషన్ మంజూరు చేసి నిర్మాణం కోసం గత ప్రభుత్వం మూడేళ్ల క్రితం 30 గుంటల భూమిని కేటాయించింది. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.4కోట్లు నిధులను మంజూరు చేశారు. అయినా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రాపురం పట్టణంలో సబ్‌స్టేషన్ నిర్మాణం నెలరోజులో పూర్తి చేయగా ఇక్కడ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిత్యం అధికారులు వివిధ కారణాలతో విద్యుత్ కోత విధిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

పనులు పూర్తి చేయండి



సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను అధికారులు ఎందుకు వేగంగా చేయడం లేదో అర్థం కావడం లేదు. దీనిపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలి. త్వరగా స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకొస్తే ప్రజలకు కష్టాలు తొలగిపోతాయి.

– రవికుమార్, ఇంద్రానగర్

త్వరలోనే వినియోగంలోకి..

వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. త్వరలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొని వస్తాం.

– బాలకృష్ణ, ఏఈ



కందికి వెళ్లేదారిలో చెట్లకొమ్మలను పూర్తిగా నరికివేత

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

హరితహారం పేరుతో దారిపొడవునా చెట్లు నాటారు. అవి పెరగగానే ఏదో సాకుతో నరికేస్తారు. ఎక్కడైనా అడ్డు వస్తే కొమ్మలను తొలగించాలి.. కొన్ని చోట్ల పూర్తిగా నరికివేస్తున్నారు. దీని వల్ల చెట్లు నాటి ఏం లాభమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. – సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



యువకులతో కాంగ్రెస్ నేత నీలం మధు

మేముసైతం 'నీలం' కోసం..

రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా టీంలు

పటాన్‌చెరు: సీఎం రేవంత్‌రెడ్డి బాటలో పయనిస్తున్న కాంగ్రెస్ నేత నీలం మధుకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా యువత మేము సైతం నీలంకు తోడుగా అంటూ యువత ముందుకు వచ్చింది. సామాజిక న్యాయం, బహుజనుల ఐక్యత కోసం పోరాటం చేస్తున్న నీలంకు తోడుగా ఉంటామని 33 జిల్లాల యువకులు కదిలారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలతో పాటు 119 నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా సోషల్ మీడియా టీంలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 21 జిల్లాల్లో అభిమానులు జిల్లా సోషల్ మీడియా కమిటీలు ఏర్పాటు చేశారు. సోమవారం మూడు జిల్లాలు సిద్దిపేట, సూర్యాపేట, కామారెడ్డిలకు చెందిన యువత మధును చిట్కుల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వానికి, నీలం మధుకి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రచారాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. తన మీద అభిమానులతో రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా టీంలు ఏర్పాటు చేస్తున్నందుకు నీలం వారిని అభినందించారు. ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందిస్తూ సేవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్, రంజిత్, అశోక్ ముదిరాజ్, సిద్దిపేట శేఖర్, సూర్యాపేట కరుణాకర్, కామారెడ్డి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.60 లక్షల సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాల ప్రాంగణంలో గ్రౌండ్ లెవెలింగ్ వాలీబాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాల ఆధునీకరణ పనులను రాబో యే విద్యా సంవత్సరంలోపు పూర్తి చేయా లని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చంద్రారెడ్డి, హనుమంత్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి, బీరప్ప యాదవ్, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్ఓ నర్సింలు, ఇన్‌చార్జి ఎంఈఓ కుమారస్వామి, హెచ్ఎం మంగీలాల్, నాయకులు జైపాల్రెడ్డి, వరప్రసాద్ రెడ్డి, యాదిరెడ్డి పాల్గొన్నారు.

వెటర్నరీ వైద్యుడిపై చర్యలు తీసుకోండి

కంగ్టి(నారాయణఖేడ్): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కంగ్టి పశు వైద్యాధికారి సయ్యద్ ముస్తాక్‌పై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దాస్ డిమాండ్ చేశారు. సోమవారం కంగ్టిలోని పశు వైద్యశాలను సందర్శించారు. పశువైద్యశాలకు తాళం వేసి ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. రైతులతో కలిసి నిరసన చేపట్టారు. డాక్టర్, వెటర్నరీ సిబ్బంది, అటెండర్ కూడా అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జేడీ శ్రీనివాస్‌శెట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



వట్‌పల్లి: కరపత్రాలను పంపిణీ చేస్తున్న జ్ఞానమంజరి తదితరులు



రాయికోడ్: బడిబాటలో భాగంగా నిర్వహించిన ర్యాలీ

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని టీఎస్ టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి అన్నారు. సోమవారం అందోల్ పరిధిలోని డాకూరు, బ్రహ్మణపల్లి, అక్సాన్‌పల్లి తదితర గ్రామాల్లో పిల్లలను చేర్పించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉండడంతో పాటు ఇంగ్లీష్ మీడియం, కంప్యూటర్ విద్య బోధించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తాన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అశోక్, ప్రధాన కార్యదర్శి సాయిలు, కోశాధికారి శ్రీనివాస్‌రావు, కార్యదర్శి అరుణశ్రీ, ధన్‌రాజ్, కౌసల్యదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల మానసిక వికాసం

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మానసిక వికాసంతో ఎదుగుతారని రాయికోడ్ పీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. రాయికోడ్‌లో సోమవారం 'బడిబాట'లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని మౌలిక సౌకర్యాలు, బోధన, ప్రభుత్వ విద్యా పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను చదివించడం ఆర్థికంగా తల్లిదండ్రులకు భారంగా మారుతోందన్నారు. యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజ నం అందించి పిల్లలకు ఒత్తిడిలేని చదువును అందిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో సత్తువ

డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

జహీరాబాద్: పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భిక్షపతి పేర్కొన్నారు. సోమవారం రైతులకు డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సబ్సిడీపై విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనుము, జీలుగ విత్తనాలు విత్తుకొని 45రోజుల తర్వాత నేలలో కలియ దున్నుకోవడం వల్ల నేలలో నత్రజని స్థిరికరించుకొని సేంద్రీయ కర్బనం పంటలకు ఉపయోగపడుతుందన్నారు. 40 కిలోల విత్తనం రెండున్నర ఎకరాలకు సరిపోతుందని తెలిపారు. 40 కిలోల విత్తనం ధర రూ.5,020లు కాగా, సబ్సిడీ పోను రైతులు రూ.2,510 చెల్లించి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు లావణ్య, హస్నుద్దీన్, ఏఈఓలు ప్రదీప్‌కుమార్, వీరేందర్ రాజు, మనోహర్, భుమేష్, స్రవంతి, చరణ్, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సంగారెడ్డి పాత బస్టాండ్ , జాతీయ రహదారి, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 20మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టు హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఎనిమిది మందికి రూ. 2000, ఆరుగురికి రూ.1500, మరో ఆరుగురికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు పేర్కొన్నారు.

పటాన్‌చెరులో18 మందికి..

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా ఇద్దరికి రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.వెయ్యి, 14 మందికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

తేమశాతం తక్కువ ఉంటేనే కొనుగోళ్లు



తేమశాతం పరిశీలిస్తున్న ఏపీఎం ప్రేమలత

చిలప్‌చెడ్(నర్సాపూర్): ధాన్యంలో తక్కువ తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని ఏపీఎం ప్రేమలత స్పష్టం చేశారు. సోమవారం మండల పరిధి చండూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఓ వైపు కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోవడం, తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించకపోవడం ఎంతవరకు సమంజసమని రైతులు ఏపీఎం ప్రేమలతను ప్రశ్నించారు. పైగా తడసిన ధాన్యం బస్తాలు మొలకెత్తితే పట్టించుకోకుండా, తేమశాతం తక్కువగా ఉండేలా చూసుకోమనడం సరికాదన్నారు. ఈ విషయమై ప్రేమలత మాట్లాడుతూ.. రైస్‌మిల్లుల యాజమాన్యం ధాన్యం బస్తాలను త్వరగా ఖాళీ చేయకపోవడంతో లారీల కొరత ఏర్పడుతుందన్నారు. తేమశాతం తక్కువ ఉంటేనే ధాన్యం కొనుగోలు చేయాలని పైఅధికారులు సూచించారని చెప్పారు.

జీలుగ విత్తనాల కోసం బారులు

జోగిపేట (అందోల్): జోగిపేట వ్యవసాయ కార్యాలయం వద్ద సోమవారం జీలుగ విత్తనాల కోసం రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. మండలంలోని రైతులు పర్మిట్ కూపన్ల కోసం ఎగబడ్డారు. తమ పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూలైన్‌లో ఉంచారు. మొత్తం 300 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

జిన్నారంలో పంపిణీ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సోమ వారం జీలుగ విత్తనాల పంపిణీ చేశారు. ఆత్మకమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి , మండల వ్యవసాయ అధికారి రవీంద్రనాథ రెడ్డితో కలిసి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట దిగుబడికి జీలుగ విత్తనాలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, గంగు రమేష్, నరేందర్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



జిన్నారం: విత్తనాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ చంద్రమౌళీశ్వరుడికి పుష్పాభిషేకం



నారాయణఖేడ్: మండలం పరిధి వెంకటాపూర్ చౌరస్తాలోని భక్తమార్కండేయ ఆలయంలో సోమవారం చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, మహాహారతి, పుష్పార్చన, గీతాపారాయణం, లలితాసహస్ర నామావళి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణచందర్, మధువాణి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

◆ బోరు మోటారు ప్రారంభం

మునిపల్లి(అందోల్): ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ సహకారంతో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించామని మాజీ ఎంపీటీసీ రాధాబాయి జ్యోషి అన్నారు. సోమవారం మండలంలోని పెద్దచల్మెడలో ముస్లిం మైనార్టీ స్మశాన వాటిక, ఎస్సీ కాలనీలో బోరుమోటార్‌ను మాజీ ఎంపీటీసీ రాధాబాయి జ్యోషి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు బాబుమీయా, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ భక్తిశ్రద్ధలతో కూడికలు



రాయికోడ్(అందోల్): మండలంలోని పీపడ్‌పల్లి గ్రామ మెథడిస్ట్ చర్చిలో సోమవారం కుటుంబ ఆశీర్వాద కూడికల దైవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి దైవజనుల బోధనలు ఆలకించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

◆ వైద్య కేంద్రాలతో లబ్ధి

ఝరాసంగం, (జహీరాబాద్): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బర్దిపూర్‌లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే వైద్యులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, నాయకులు ఉజ్వల్ రెడ్డి, ఉదయ్ శంకర్‌పాటిల్, వేణుగోపాల్ రెడ్డి, హఫీజ్, రాజ్‌కుమార్ స్వామి, నరసింహారెడ్డి, ఆశ్రమ పీఠాధిపతులు సీసీ 1008 వైరాగ్య శిఖామని అవధూత గిరి మహరాజ్, సిద్ధేశ్వర స్వామి పాల్గొన్నారు.

◆ బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు

జహీరాబాద్(జహీరాబాద్): విశ్వగురు బసవేశ్వవిగ్రహానికి డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, తెలంగాణ రాష్ట్రీయ బసవదళ అధ్యక్షుడు శంకరప్ప పాటిల్ ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం మండలంలోని హుగ్గెల్లి వైజంక్షన్ జహీరాబాద్‌లో బసవేశ్వర విగ్రహాన్ని నూతనంగా ఆవిష్కరించారు.

◆ కూలీలకు ఉపాధి కల్పించాలి

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీఓ సత్తయ్య పేర్కొన్నారు. సోమవారం కంగ్టి మండల పరిషత్తులో పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పనుల గురించి కూలీలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని ఆదేశించారు. నర్సరీల ఏర్పాటు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, తదితర ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్ష చేశారు.

◆ ఆదాయ వ్యయాలపై సమావేశం



జహీరాబాద్(జహీరాబాద్): ఆదాయ వ్యయాలపై వ్యవసాయ కమిటీ చైర్మన్ సాయి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సోమవారం 2025 మార్చి, ఏప్రిల్ రెండు మాసాల ఆదాయ, వ్యయాలపై వ్యవసాయ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుజాత, అశోక్, శేఖర్, అఖిల్ అహ్మద్, వంశీ, నర్సింలు, శంకర్ పాటిల్, జఫ్ఫార్, మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి ఎ.చంద్రశేఖర్, వీరేషెట్టి, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: గుడికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 24న గుడికి వెళ్లొస్తానని చెప్పి ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. తల్లి సోమవారం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కార్మికుడు మృతి

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రం హత్నూర గ్రామపంచాయతీ కార్మికుడు గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మైసగళ్ల పోచయ్య(55), గ్రామపంచాయతీలో పారిశుద్ధ్యం ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. సోమవారం ఉదయం ఇంట్లో ఒకసారిగా అస్వస్థత గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

కల్హేర్(నారాయణఖేడ్): సైబర్ నేరస్తులపై అప్రమత్తంగా ఉండాలని సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా వచ్చే లింక్‌లు, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని తెలిపారు. లోన్ యాప్ జోలికి పోవద్దని సూచించారు.